

పేద విద్యార్థులకు ఫీజు నేనే చెల్లిస్తా

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం: పాలిటెక్నిక్ విద్య అభ్యసించడానికి ముందుకొచ్చే పేద విద్యార్థులకు ఫీజు తానే స్వయంగా చెల్లిస్తానని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేకు విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో ఆమె తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వీరేంద్రప్రసాద్, అధ్యాపకులు, విద్యాశాఖాధికారులతో సమావేశమై సమీక్షించారు. కళాశాలలో చేరేకు తక్కువగా ఉండటంపై సంబంధిత అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రానున్న పది రోజుల్లో పాలిటెక్నిక్ కళాశాలలో చేరేలను పెంచేందుకు కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఎస్ఎ పిఒ పి.శ్యాంసుందర్, డిఇఒ కార్యాలయ ఎడి ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రణాళికలేనా.. పనులు జరిగేనా..!



- చింతలపూడి ప్రాజెక్టుపై జనంలో చర్చ
- 2026కు మొదటి దశ పనులు పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటన
- రెండు దశల్లో ప్రాజెక్టు పూర్తి చేసేలా జలవనరుల శాఖ ప్రణాళిక
- రూ.4,465 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనాలు
- ఇప్పటికీ భూనిర్వాసితులకు అందని పరిహారం
- ప్రాజెక్టు పూర్తయితే 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు, 12 లక్షల మందికి తాగునీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో మెట్టప్రాంతానికి ఎంతో కీలకమైన చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రణాళికలకే పరిమితం అవుతుందా.. లేక పనులు ముందుకు సాగిస్తుందా అనే చర్చ జిల్లా ప్రజానీకంలో నడుస్తోంది. చింతలపూడి ప్రాజెక్టు 2008లో ప్రారంభమైనప్పటికీ 16 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ పూర్తికాకపోవడమే అందుకు కారణంగా చెప్పొచ్చు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు, 12 లక్షల మంది ప్రజానీకానికి తాగునీరు అందే అవకాశం ఉంది. టిడిపి కూటమి ప్రభుత్వం ముందుగా రాష్ట్రవ్యాప్తంగా ఆరు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయనున్నట్లు ప్రణాళికలు ప్రకటించింది. అందులో చింతలపూడి ప్రాజెక్టు కూడా ఉంది. దీంతో జిల్లా ప్రజానీకంలో ఈ ప్రాజెక్టు పూర్తిపై తీవ్రమైన చర్చ నడుస్తోంది. 2008లో చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టును రూ.1,701 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించింది. ఈ ప్రాజెక్టు విస్తరణతో 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాజెక్టు పూర్తికి రూ.4,909.80 కోట్లు ఖర్చవుతుందని ప్రణాళికలు రూపొందించారు. టిడిపి ప్రభుత్వంలో పనులు వేగవంతంగా సాగాయి. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చింతలపూడి ప్రాజెక్టు పనులు పూర్తిగా పడకేశాయి. పాత బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. గడిచిన ఎన్నికల సందర్భంగా నూజివీడు, చింతలపూడి పర్యటనలో సిఎం చంద్రబాబు తాము అధికారంలోకొచ్చాక చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు తగినట్లుగానే ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తొలివిడతలో రూ.రెండు వేల కోట్లు ఖర్చు చేస్తే 50 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడంతోపాటు, 2.10 లక్షల ఎకరాలకు స్థిరీకరణ దక్కుతుందని ప్రభుత్వం చెబుతోంది. మొదటి దశ పనులను 2026కు పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రెండో దశ పనులకు రూ.2,465 కోట్లు ఖర్చవుతుందని, పనులు పూర్తయితే లక్షా 50 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితోపాటు 70 వేల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ, 12 లక్షల మంది ప్రజానీకానికి తాగునీరు అందనుందని ప్రభుత్వం చెబుతోంది. 2028 నాటికి ప్రాజెక్టు మొత్తం పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం చెప్పుకొస్తోంది. పదిహేనేళ్లుగా ప్రభుత్వాలు ఇదేవిధంగా చెబుతున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదని జిల్లా ప్రజానీకం పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి సాగునీరు అందించాలని జిల్లా రైతాంగం కోరుతోంది.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేనా?

చింతలపూడి ప్రాజెక్టుకు భూసేకరణ సమయంలోనే పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ సాగింది. పట్టిసీమ ప్రాజెక్టు, పోలవరం కుడికాలువలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ప్రభుత్వం పరిహారం ఇచ్చింది. చింతలపూడి రైతులకు మాత్రం ఎకరాకు రూ.12 లక్షలు మించి ఇవ్వడం కుదరదని తెలిపింది. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. బహిరంగ మార్కెట్లో ఎకరా ఖరీదు రూ.40 లక్షల వరకూ ఉండగా, ఎకరాకు కనీసం రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. అప్పట్లో టిడిపి ప్రభుత్వం ససేమిరా అంది. 2019 ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే చింతలపూడి రైతులకు న్యాయం చేస్తామని జగన్ తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక చింతలపూడి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఇప్పటికీ చింతలపూడి నిర్వాసిత రైతులకు పరిహారం అందలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం ముందుగా ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాల్సి ఉంది. అప్పుడే ప్రాజెక్టు పనులు మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం ఉంటుంది. రైతులకు ఇబ్బంది పెట్టి ముందుకు సాగాలనుకుంటే మాత్రం రైతుల నుంచి ప్రతిఘటన ఎదురుకాక తప్పదు. రైతులకు ఇప్పటికైనా న్యాయమైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

చేనేత వస్త్రాలను ధరించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో చేనేతను ప్రోత్సహించేందుకు వాటిని ధరించడంలో ఉన్న సౌలభ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలు కూడా చేనేత వస్త్రాలను ధరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం స్థానిక డిఎన్ఆర్ కళాశాల సిల్వర్ జూబ్లీ సమావేశం మందిరంలో జిల్లా చేనేత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో చేనేత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలన్నారు. చేనేత వస్త్రాల కొనుగోలు ద్వారా చేనేత కార్మికులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. వస్త్రాలు ధరించడంలో సౌలభ్యంతోపాటు ఆరోగ్యపరంగా కూడా మంచి చేకూరుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 95 శాతం చేనేత ఉత్పత్తులు మన దేశం నుండే ఉన్నాయన్నారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా స్వాతంత్ర సమరయోధులు చేనేతకు మంచి ఆదరణ తీసుకొచ్చారన్నారు. నేటి యువతకు చేనేత వస్త్రాల గురించి పెద్దలు చెబితేగానీ తెలియని విషయంగా మారిందన్నారు. చేనేత వస్త్రం తయారీలో కార్మికుల కష్టం ఎక్కువగా ఉంటుందని, అయితే ఆ వస్త్రాలకు మనం చెల్లించే ఖరీదు తక్కువేనని చెప్పాలన్నారు. జిల్లాలో సుమారు 1,027 మంది చేనేత కార్మికులు ఉన్నారన్నారు. సమావేశంలో తన దృష్టికి వచ్చిన చేనేత కార్మికుల సమస్యలు, సూచనలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చేనేత కార్మికులు సిద్ధాని విఘ్నేశ్వరరావు, సమతం చిన్న సముద్రంలింగంలను కలెక్టర్ శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.రామయ్య, ఎడిఒ జి.గుర్రాజు, డిఎన్ఆర్ కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, వైస్ ప్రెసిడెంటు గోకరాజు పాండురంగరాజు, జాయింటు సెక్రెటరీ కె.రామకృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపల్ జి.మోజెస్, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, చేనేత కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలివ్వాలని 9న ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

ధాన్యం బకాయిల చెల్లింపులో రాష్ట్రస్థాయి అధికారులు రైతులను మోసగించడం తగదని, తక్షణం బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 9న నరసాపురంలో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 30 వేల మంది రైతులకు రూ.450 కోట్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యం సొమ్ము కోసం ఆందోళన చేస్తే ఆగస్టు ఆరో తేదీలోపు ఇస్తామని రాష్ట్ర స్థాయి అధికారి హామీ ఇచ్చారని, ఇంకా రాలేదని అడిగితే మరో వారం రోజుల్లో వస్తాయని చెప్పడం దారుణమని విమర్శించారు. తక్షణమే ధాన్యం బకాయిలు చెల్లించకపోతే 9న ధర్నా చేపడతామని, దీనిలో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సెప్టెంబర్ 14న లోక్ అదాలత్

ప్రజాశక్తి - తణుకు

సెప్టెంబర్ 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకుని విలువైన డబ్బు, సమయం ఆదా చేసుకోవాలని ఛైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి సూచించారు. బుధవారం తణుకు కోర్టు ఆవరణలో తణుకు పరిధిలో పనిచేసే పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను రాజీ చేసేందుకు పోలీసులు కృషి చేయాలన్నారు. కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించి ఇరుపక్షాలను రాజీ దిశగా తీసుకొచ్చి కోర్టుల్లో పేరుకుపోయిన పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, పివి రంజిత్‌కుమార్, ఎవి.నాగరాజు, స్పెషల్ కోర్టు జడ్జి చిరంజీవిరావు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తను కోల్పోవడం బాధాకరం

పితాని కుటుంబ సభ్యులకు ప్రముఖుల పరామర్శ

ప్రజాశక్తి - పోడూరు రూరల్

గొప్ప విద్యాపోషకులు, పారిశ్రామికవేత్త పితాని సూర్యనారాయణ మృతి బాధాకరమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి అన్నారు. బుధవారం ఉదయం కొమ్ముచిక్కాలలోని పితాని సూర్యనారాయణ స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో పెనుగొండలో ఎస్‌వికెపి జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారని కొనియాడారు. ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ సోదరుడే సూర్యనారాయణ కావడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పితాని కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, మాజీ ఎంఎల్‌సి రెడ్డి సుబ్రమణ్యం, మాజీ ఎంఎల్‌ఎ బంగారు ఉషారాణి, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, టిడిపి రాష్ట్ర నేత మెంటే పార్థసారధి, వైసిపి నాయకులు గుడాల గోపి, సత్తి రామిరెడ్డి, ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, నేతలు చేగొండి సూర్యప్రకాష్, గణపతినీడి రాంబాబు, ఉండవల్లి సత్యనారాయణమూర్తి (చిన్ని), గణపతినీడి రాంబాబు ఉన్నారు.

వ్యాయామోపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

పశ్చిమగోదావరి జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షులుగా బి.జాన్సన్ (తణుకు జోన్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మార్టేరులో జరిగిన ఎన్నికలో జిల్లాలోని అన్ని జోన్లకు చెందిన సుమారు 200 మంది వ్యాయా మోపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా ఎస్.సుధాకర్ వ్యవహరించారు. జిల్లా కార్యదర్శిగా మహ్మద్ ఖుద్దుస్ (భీమవరం జోన్), ఛైర్మన్‌గా కె.కృష్ణారెడ్డి (ఆచంట జోన్), గౌరవాధ్యక్షులుగా చింతకాయల సత్యనారాయణ (తాడేపల్లిగూడెం జోన్), కోశాధికారిగా బి.గంగామహేష్ నాయుడు (నర్సాపురం జోన్), ఉపాధ్యక్షులుగా డిఆర్‌జెఎస్.శేఖర్‌బాబు (తాడేపల్లిగూడెం జోన్), జి.బలరామరాజు (నరసాపురం), సహాయ కార్యదర్శులుగా కెవిఆర్.సుబ్బారావు (తణుకు), కె.వినాయకరెడ్డి (ఆచంట జోన్), జిల్లా మహిళా ప్రతినిధిగా వి.నర్మద (భీమవరం జోన్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి తెలిపారు.

పెరటి కోళ్ల పెంపకంతో అధిక లాభాలు

ఉండి: చిన్న తరహా కుటీర పరిశ్రమగా పెరటి కోళ్ల పెంపకాన్ని ఎంచుకున్నట్లయితే అధిక లాభాలు ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ మల్లికార్జునరావు అన్నారు. పెరటి కోళ్ల పెంపకంపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్యక్రమంలో పాల్గొన్న కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లికార్జునరావు మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న రైతులు చిన్న తరహా కుటీర పరిశ్రమగా వెరైటీ కోళ్ల పెంపకం ఎంచుకున్నట్లయితే అధిక లాభాలు పొందవచ్చన్నారు. వెటర్నరీ డాక్టర్ హేమ మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకాన్ని తక్కువ కోళ్లతో ప్రారంభించి అవగాహన పెంచుకుని అంచెలంచెలుగా కోళ్ల పెంపకాన్ని విస్తరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డెబోరా మెస్సియానా, డాక్టర్ ఎ శ్రీనివాస్, డాక్టర్ పి.వినాయలక్ష్మి, బి.రజిత, రైతులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కల్పించండి

ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - గణపవరం

ప్రాణాంతకమైన కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు వైద్యులకు సూచించారు. బుధవారం సరిపల్లి లయన్స్ క్లబ్ ఆవరణలో పిఎంపి అసోసియేషన్ గణపవరం, నిడమర్రు మండల కమిటీల ఆధ్వర్యంలో కేన్సర్‌పై ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో పాల్గొని మాట్లాడారు. సదస్సుకు అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎంఎల్‌ఎ ధర్మరాజు మాట్లాడుతూ కేన్సర్ అంటేనే ప్రజలు భయపడి మానసికంగా కుంగిపోతున్నారన్నారు. సరైన అవగాహన లేకపోవడంతో సకాలంలో చికిత్స పొందక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కేన్సర్‌కు కారకాలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, కేన్సర్ వస్తే ఏం చేయాలనే దానిపై అవగాహన కల్పించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

కార్యక్రమంలో పిఎంపి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నిడమర్తి జయకృష్ణ, జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వరులు, కొటకల అప్పారావు, విద్యాజ్యోతి కాన్వెంట్ కరస్పాండెంట్ సిహెచ్.నాగేశ్వరరావు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జైలుకెళ్లినా బుద్ధి మారలేదు..!

- బెయిల్‌పై వచ్చి మరో ఘాతుకం
- చిన్నారిపై అత్యాచార కేసు నిందితుని అరెస్టు
- కఠిన చర్యలు తప్పవు: ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

2019లో రెంటచింతల ప్రాం తంలో బాలికపై అత్యాచారం కేసులో జైలు కెళ్లాడు. అనంతరం బెయిల్‌పై బయటికొచ్చి లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. అయినా బుద్ధి మారని ఆ మృగాడు మరో చిన్నారిపై అకృత్యా నికి పాల్పడ్డాడు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో చిన్నారి అపహరణ, అత్యాచా ర కేసుకు సంబంధించి పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఈ కేసులో నిందితుని అరెస్టు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిశోర్ బుధవారం మధ్యాహ్నం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో గత ఆదివారం రాత్రి నానమ్మ వద్ద నిద్రిస్తున్న బాలికను ఆగంతకుడు సమీప పామాయిల్ తోటలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి వదిలేసి పరారైన సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులకు సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో సమాచారం అందిందని, వెంటనే ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, ఏలూరు దిశా పోలీసు స్టేషన్ ఎస్‌ఐ క్రాంతిప్రియ హుటాహుటీన 15 నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకున్నారని ఎస్‌పి తెలిపారు. అక్కడ నుంచి బాలికను వైద్యం నిమిత్తం నూజివీడు ఆసుపత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి ఎస్‌ఐ క్రాంతిప్రియ స్వయంగా తరలించారన్నారు. అనంతరం డిఎస్‌పి పర్యవేక్షణలో ఏలూరు టుటౌన్ సిఐ ప్రభాకర్, నిడమర్రు సిఐ సుభాష్ భీమడోలు సిఐ బి.రవికుమార్, నూజివీడు సిఐ కె.రామకృష్ణ నేతృత్వంలో నాలుగు బృందాలు దర్యాప్తు చేపట్టాయన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా గుంటూరు అర్బన్ డిఎస్‌పి, గుంటూరు ఎస్‌పి, పల్నాడు ఎస్‌పిల సహకారంతో నిందితుడు పల్నాడు జిల్లా రెంటచింతల మండలం కుమ్మరికోట గ్రామానికి చెందిన మిర్యాల జయరావుగా గుర్తించామని చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు పల్నాడు జిల్లాలో ఒక వాహనంలో



మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రయాణిస్తున్నట్లు గుర్తించి చాకచా క్యంగా మంగళవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. లారీ క్లీనర్‌గా పని చేస్తున్న జయరావు 2019లో రెంటచింతల ప్రాంతంలో బాలికపై అత్యాచారం కేసులో అరెస్టయి జైలుకెళ్లాడని, ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నాడని గుర్తించామన్నారు. బెయి ల్ రద్దుకు సంబంధించి ఆయా అధికారులు, కోర్టు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. లారీ క్లీనర్‌గా నూజి వీడు వచ్చి ఆదివారం రాత్రి బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడని, ఎటువంటి ఆధారాలు లేకపోయినా తమ సిబ్బంది సమర్థవంతంగా, అత్యంత చాకచక్యంగా పనిచేసి వేగంగా నిందితుడిని పట్టుకున్నారని ప్రశంసించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అఫండర్ అగైనెస్ట్ ఉమన్ అండ్ చిల్డ్రన్ పేరిట మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్ తెరుస్తున్నామని, దాని ఆధారంగా ఒకటికి మించి నేరాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని స్పష్టం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారని తెలిపారు. సమావేశంలో ఏలూరు పూర్వపు డిఎస్‌పి శ్రీనివాసులు, భీమడోలు, నూజివీడు, నిడమర్రు పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రాయితీ పరికరాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

బిందు, తుంపర్ల సేద్యానికి సంబంధించి రాయితీపై పరికరాలు పొందేందుకు ఆసక్తి కలిగిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి మేలు చేసేలా అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకుని బిందు, తుంపర్ల సేద్యానికి సంబంధించి పరికరాలను సబ్సిడీతో ఇచ్చి ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ పథకం కింద అన్ని రకాల పండ్లు, కూరగాయలు, పూల తోటలకు రాయితీపై బిందు, తుంపర్ల సేద్య పరికరాలను అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాకు 2023-24 సంవత్సరానికి 500 హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, గత ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేయించుకుని పరిపాలన ఉత్తర్వులు పొందని రైతులు ఈ ఏడాది తిరిగి రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం జిల్లాలో బిందు, తుంపర్ల సేద్యం అమలుకు చర్యలు చేపట్టడంలో భాగంగా సంబంధించి ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీపై, 5 ఎకరాల నుంచి 12.5 ఎకరాల లోపు కలిగిన రైతులకు 50 శాంతం సబ్సిడీపై పరికరాలు అందజేస్తామన్నారు. సుధాకర్, నెటాఫిమ్, గ్లోబల్ డ్రిప్ కంపెనీల పరికరాలను మాత్రమే అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకూ భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రోడ్లు, డ్రెయిన్లు ఏకమై చెరువులు, కాల్వలను తలపించాయి. మున్సిపల్ కమిషనర్ విజయ సారథి ఎప్పటికప్పుడు డ్రెయిన్లలో సిల్టు తీయిస్తున్నా పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగిపొర్లాయి.



పాలకొల్లులో భారీ వర్షంతో రోడ్డుపై నిలిచిన నీరు

కొండవాగులు ఉధృతం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

భారీ వర్షాలకు మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కాజ్‌వేల వద్ద ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. రెడ్డిగణపవరం కాజ్‌వే, ఇప్పలపాడు కాజ్‌వే, అల్లి కాలువ కోట రామచంద్రపురం కాజ్‌వేలపై నుంచి నీరు ప్రమాదకర స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తోంది. బుట్టాయగూడెం గిరిజన బాలికల కళాశాల వసతి గృహం ప్రాంగణంలోనే వర్షపు నీరు నిలిచిపో వడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అపారిశుధ్య వాతావరణంతో విద్యార్థినులు జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని, తక్షణం వసతి గృహం ప్రాంగణంలో నిలిచిన నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. తహశీల్దార్ కార్యాలయానికి పక్కనే ఉన్న బుట్టాయగూడెం పశువుల ఆసుపత్రి చిన్నపాటి వర్షానికి జలమయమైంది. గత నెలలో భారీ వర్షాలకు కొండవాగులు పొంగడంతో గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లే రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. దీంతో ఆలయ దర్శనాన్ని కొన్ని రోజులు నిపివేసి పాడైపోయిన రహదారులను ఆలయ కమిటీ మరమ్మతులు చేసి ఈ నెల 4వ తేదీ నుంచి ఆలయ దర్శనాన్ని ప్రారంభించారు. మళ్లీ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆలయం పైనుంచి కొండ వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది.

జీలుగుమిల్లి: మండలవ్యాప్తంగా బుధవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. చెరువులు నిండుకుండల్లా మారాయి. పలుచోట్ల వరినాట్లు నీట మునిగాయి. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో కామయ్యపాలెం వాగు, అశ్వారావుపేట వాగు, సంగం వాగు, పాలచర్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

బుట్టాయగూడెం రూరల్: భారీ వర్షాల కారణంగా కన్నాపురం పడమర కాల్వ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ చేతి వృత్తుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కరరావు కోరారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన మార్టేరులో మాట్లాడారు. చేనేత కార్మిక కుటుంబాలు నేసిన వస్త్రాలకు కూలి డబ్బులు అందక, పొట్టకూటి కోసం నమ్మిన వృత్తిని వదిలేయలేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కార్మికులు కాలం గడుపుతున్నారన్నారు. తినడానికి తిండి లేక, చేయడానికి పని లేక కార్మికులు అగమ్యగోచర స్థితిలో ఉన్నారన్నారు. సత్వరం చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

తణుకు : దేశంలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత వృత్తి ప్రాముఖ్యత కలిగి ఉందని వేల్పూరు గ్రామ సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక సాలిపేటలో చేనేత పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత కార్మికులు ఐక్యంగా ఉండాలని, వృత్తిని కాపాడుకోవాలని అన్నారు. చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేనేత వృత్తిని దెబ్బతీసే విధానాలు అమలు చేస్తోందన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి సంక్షేమం, అభివృద్ధి కోసం అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయించకుండా చేనేత విధ్వంసం విధానాలను రూపొందించి అమలు చేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికీ ప్రభుత్వం ప్రకటించిన జిఒ ప్రకారం 100 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, కొడవటి కోటమల్లయ్య, అందే కోటనరసింహారావు, వాసా పోసియ్య పాల్గొన్నారు.

ఐదేళ్ల వైసిపి పాలనలో చేనేత రంగం పూర్తి నిర్లక్ష్యానికి గురైందని తణుకు కూటమి నాయకులు అన్నారు. ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించి, చేనేత జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతకారుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. నేతన్న హస్తం పేరుతో వాళ్లకు ఇచ్చే అన్ని పథకాలనూ వైసిపి రద్దు చేసిందన్నారు.

పెనుగొండ : స్వతంత్ర పోరాటంలో చేనేత వస్త్రాల ప్రాధాన్యత ఎంత ప్రాముఖ్యమైందో గాంధీజీ నిరూపించారని ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ వైవివి అప్పారావు తెలిపారు. ఎన్‌ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడారు. సహజంగా తయారు చేసే చేనేత వస్త్రాలు శరీరానికి ఎంతో సుఖాన్ని అందిస్తాయన్నారు. ఈ సందర్భంగా వడలి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు అందే కోటిలింగంను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ టి.దివాకర్, ఆర్ఎన్.శ్రీనివాస్, మీరయ్య హాజరయ్యారు.

పాలకొల్లు : చేనేత కార్మికులు బాగా వెనుకబడి ఉన్నారని బిసి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణు గోపాలరావు అన్నారు. పాలకొల్లు వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘం అధ్యక్షులు వట్టం గణేష్ ఆధ్వర్యంలో పాలకొల్లు వీవర్స్ కమిటీ హాల్ వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం బైక్ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి నీలంశెట్టి సత్యప్రసాద్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, రాంబాబు, ట్రెజరర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మవరం టౌన్ : యువత, ఉద్యోగులు వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరించాలని, చేనేతకు జీవం పోయాలని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బుధవారం భీమవరం పద్మశాలి సంఘం, కరికాల సంఘం, దేవాలయ సంఘం అధ్వర్యంలో ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో 10వ జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడారు. చేనేత కార్మికుల సమస్యలు, సూచనలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, సంఘం అధ్యక్షులు టిడివి శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - ఆచంట

ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఎంపిడిఓ పి.నరసింహప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులకు అత్యవసర సమావేశం ఇఒపిఆర్‌డి టి.మూర్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నరసింహప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంపూర్ణ పారిశుధ్యానికి గ్రామస్తులందరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామ పంచాయతీ వాహనాలను వినియోగించి సేకరించిన చెత్తను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లలో డంపింగ్ చేయాలన్నారు. మురుగునీరు బయటకు వెళ్లేలా డ్రెయినేజీలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు దరి చేరవన్నారు. వీధిలైట్ల విషయంలో అశ్రద్ధ చేయకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైతులకు విత్తనాలు అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

అన్నదాతకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ ఎడి ఈదా అనిల్‌కుమారి అన్నారు. మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, పేరుపాలెం కొత్తపాలెం తదితర గ్రామాల్లో రైతులకు విత్తనాలు మంగళవారం సాయంత్రం అందజేశారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు దెబ్బతిన్న నారుమడులకు నష్టపరిహారంగా ప్రభుత్వం 80 శాతం రాయితీపై 1153 రకం విత్తనాలను రైతులకు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఎప్పుడైన్న సమస్యలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి బందెల ఎలీషా, ఉపసర్పంచి మేకల పరశురాం, జనసేన మండల అధ్యక్షుడు కొల్లాటి గోపి, వ్యవసాయ శాఖ ఎఒ అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు

ప్రజాశక్తి - భీమవరం

రజక వృత్తిదారులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఏపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మడకా రాజు డిమాండ్ చేశారు. భీమవరంలో ఏపి రజక వృత్తిదారుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం యండమూరి నాగేంద్ర అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రజకులను పట్టించుకోకపోవడంతో కూడా అనేక ఇబ్బందులు గురిచేశారని విమర్శించారు. రజకులపై హత్యలు, అత్యాచారాలు రాష్ట్రంలో అనేక చోట్ల జరిగాయన్నారు. తక్షణం రజకులకు రక్షణ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రక్షణ చట్టం ఏర్పాటు చేయని పక్షంలో రజకులంతా ఐక్యతతో ఆందోళనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. రజక యువకులకు ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారన్నారు. ప్రభుత్వ జి.ఓ. ప్రకారం పర్యవేక్షణ ప్రకారం ఎక్కడా రజకులకు ఇచ్చిన దాఖలు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో యండమూరి నాగేంద్ర, మల్లిపూడి వెంకటేశ్వరరావు, యండమూరి శివ, పంగిడి రాంబాబు పాల్గొన్నారు.

సిఐగా రజనీకుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ సిఐగా కోలా రజనీకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో కూడా పాలకొల్లు సిఐగా పనిచేశారు. ఆయనను సర్కిల్‌లోని పలువురు ఎస్ఐలు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరి రక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు, జూదాన్ని అరికట్టేందుకు ప్రాధాన్యతనిస్తానని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన ఆయన క్షీరా రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

నరసాపురం ఎస్ఐగా జయలక్ష్మి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సిహెచ్.జయలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఆమె గతంలో పాలకొల్లు, నరసాపురం ట్రాఫిక్, భీమవరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేశారు. తాజా బదిలీల్లో భాగంగా భీమవరం మహిళా పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై నరసాపురం టౌన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

గత ప్రభుత్వ హయాంలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయకపోవడం శోచనీయమని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆచంట ఎయిడెడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించిందన్నారు. గత ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో తిరిగి ఉచితంగా పుస్తకాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపి ఎర్రగొప్పుల నాగరాజు, టిడిపి మండల అధ్యక్షుడు కేతా మీరయ్య, జనసేన మండల అధ్యక్షుడు జవ్వాది బాలాజీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉండి తహశీల్దార్‌గా నాగార్జున బాధ్యతలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండల తహశీల్దార్‌గా కావడి నాగార్జున బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కావడి నాగార్జున మాట్లాడుతూ సహ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

తాడేపల్లిగూడెం తహశీల్దార్‌గా సునీల్ కుమార్ బాధ్యతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం తహశీల్దార్‌గా ఎం.సునీల్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన మురళీకృష్ణ వేరే ప్రాంతానికి బదిలీ అవడంతో ఆయన స్థానంలో సునీల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు డిప్యూటీ తహశీల్దార్ శివకుమార్, విఆర్‌ఒలు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

డిఎస్‌పిని కలిసిన సిఐలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాస్‌ను నరసాపురం, పాలకొల్లు రూరల్ సిఐలు యాదగిరి, శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం డిఎస్‌పితో శాంతి భద్రతల అంశంపై మాట్లాడారు. వారి వెంట నరసాపురం ఎస్ఐ జయలక్ష్మి ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత : ఎంఎల్‌ఎ నాయకర్

నరసాపురం:రహదారి నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలో లక్ష్మణేశ్వరం గ్రామంలో నూతనంగా రూ.20 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు, వేములదీవి ఈస్ట్‌లో 30 లక్షల రూపాయలతో నిర్మించనున్న రోడ్డు పనులను ఎంఎల్ఎ శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు.

తణుకు సిఐగా కొండయ్య

తణుకు :తణుకు సిఐగా ఎన్.కొండయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం సిఐగా పనిచేస్తున్న కొండయ్య బదిలీపై తణుకు పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఇరగవరం ఎస్ఐగా నటేష్

ఇరగవరం ఎస్‌ఐగా జానా నటేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తణుకు పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇరగవరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పంట కాలువలకు కొత్త రూపు

ఎంఎల్‌ఎ చేయూత, రైతుల విరాళాలతో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు



వెంకయ్య వయ్యేరు పంటకాలువలో ప్రక్షాళన పనులు చేసిన తరువాత పరిస్థితి

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రంగాల్లో జల వనరుల శాఖ ఒకటి. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం పేరుతో ఆధునికీకరణ పనులు కొద్దో గొప్పో పనులు చేశారు. ఆయన వారసుడు జగన్ మాత్రం ఐదేళ్లలో కనీసం నిర్వహణకు కూడా సొమ్ములు ఇవ్వలేదు. దీంతో సాగునీటి రంగం పూర్తిగా చతికిలపడిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు నడుంబిగించారు. ఎంఎల్ఎ, రైతుల భాగస్వామ్యంతో ఉండి నియోజకవర్గంలో జల వనరులను అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పానికి అనూహ్య స్పందన లభించింది.

రైతుల చేయూత..

ఖరీఫ్‌లో నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు పనులు జరుగుతున్నాయి. గత ఐదేళ్లుగా పాలకుల వల్ల ప్రస్తుత ప్రభుత్వం ఆర్థిక సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాలువల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతుగా సాయం అందించాలని ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు రైతులను కోరారు. దీంతో డ్రెయినేజీ మెయింటినెన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. రఘురామకృష్ణంరాజు పంట, మురుగు కాలువలను అభివృద్ధి చేసేందుకు తన వంతు సాయం అందజేయడంతోపాటు రైతుల నుంచి విరాళాలు సేకరించడంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

వెంకయ్య వయ్యేరు..

పరిమళ లాకు నుంచి ఏలూరుపాడు వరకూ 35 కిలోమీటర్ల పొడవున వెంకయ్య వయ్యేరు పంట కాలువ ఉంది. కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులను ఒఅండ్ఎం నిధులు రూ.35 లక్షలు, రైతుల విరాళాలతో వెంకయ్య వయ్యేరు పంటకాలువలో ప్రక్షాళన పనులు చేయడంతో కాలువకు కొత్త రూపు సంతరించుకుంది. రైతులు ఒక మంచి పని చేయడానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. వెంకయ్య వయ్యేరు పంటకాలువ ప్రక్షాళన పూర్తి కావడంతో శుభ్రమైన నీరు సరఫరా చేసేందుకు మార్గం సుముఖమైంది. దీంతో పలు గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్ల తరువాత అన్నయ్య కోడు ప్రక్షాళన..

అన్నయ్య కోడు పంట కాలువలు ప్రక్షాళనకు ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు చూపుతున్న చొరవ రైతుల పాలిట వరంగా మారింది. పల్లిపాలెం నుంచి మోడీ వరకూ రైతుల విరాళాలతో పనులు చేపట్టారు.

రూ.13 లక్షలతో ప్రక్షాళన పనులు

మంతెన పెద నరసింహమూర్తిరాజు, రైతు కలవపూడి.



అన్నయ్య కోడు పంట కాలువల ప్రక్షాళన పనులు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా రూ.13 లక్షలతో చేపట్టాం. రైతుల విరాళాలతో పంట కాలువలో గుర్రపు డెక్క, పూడికతీత పనులు పూర్తయ్యాయి. ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు చొరవతో కాలువ సమస్య పరిష్కారమైంది.

బాధితులకు అండగా ఉంటాం : ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

అధిక వర్షాలు, వరద ఉధృతి వల్ల జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ముంపునకు గురైన పొన్నపల్లి, లాకుపేట బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు కేజీ చొప్పున ఎంఎల్ఎ నాయకర్ పంపిణీ చేసి మాట్లాడారు. వరద, అధిక వర్షాలు కారణంగా పల్లపు ప్రాంతాలైన పొన్నపల్లి, లాకుపేట, కోటవద్ద పాలెం తదితర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. వరద సమయంలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, తహశీల్దార్ సీతారత్నం, నాగదేవి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీ వెంకట రమణ, ఆకన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి : సిఐ



మాట్లాడుతున్న సిఐ యాదగిరి

ప్రజాశక్తి - నరసాపురం

వైఎన్ కళాశాల ఐక్యూ ఎసి, సామాజిక సేవా కేంద్రం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, పొగాకు నివారణ అంశంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసాపురం సిఐ బి.యాదగిరి విచ్చేసి మాట్లాడారు. నేడు యువత మాదక ద్రవ్యాలను ఎక్కువగా వాడుతున్నారని తెలిపారు. వారి భవిష్యత్తును వాళ్ల చేతులతో వాళ్లే నాశనం చేసుకుంటున్నారన్నారు. క్షణికానందం కోసం తీసుకునే మాదకద్రవ్యం వల్ల తల్లిదండ్రులను, కుటుంబ గౌరవాన్ని సమాజంలో దిగజార్చిన వారవుతున్నారన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చుట్టుపక్కల ఎక్కడైనా మాదకద్రవ్యాల అమ్మకం లేదా వాడకం జరుగుతున్నట్లయితే సమాచారం అందించాలని, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులంతా మాదకద్రవ్యాలు, పొగాకు నివారణపై ఉద్యమించాలని కోరారు. సీనియర్ అడ్వకేట్ యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్ మాట్లాడుతూ, ఎన్‌డిపిఎస్ యాక్ట్ సెక్షన్ 27 ప్రకారం మాదకద్రవ్యాలను కలిగిఉన్నా, తీసుకున్నా, అమ్మినా, పెంచినా, రవాణా చేసినా కనీసం ఆరు నెలల జైలు శిక్ష, రుసుం చెల్లించాల్సి ఉందన్నారు. అకడమిక్ అడ్వయిజర్, రిటైర్డ్ సైంటిస్ట్ ఆర్‌వి.సుబ్బారావు, సీనియర్ రిటైర్డ్ ఎల్.రాజేంద్ర ప్రసాద్ ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, పిజి డైరెక్టర్ నిమ్మల చింతారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయకర్త యనుముల సతీష్ పాల్గొన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు

పెనుగొండ:పేదలకు వైద్యం అందించాలనే లక్ష్యంతో బివి రమణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు బుధవారం నిర్వహించారు ఈ క్యాంపులో ఏలూరు ఆశ్రమం హాస్పిటల్, భీమవరం విష్ణు డెంటల్ హాస్పిటల్, పాలకొల్లు రాజవల్లి రాధా రామన్ కంటి లయన్స్ హాస్పటల్, విజయ డయాగ్నసిస్ పాలకొల్లు వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ములపర్రులో నిర్వహించిన వైద్య శిబిరంలో 400 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ములపర్రు చుట్టుపక్కల ప్రాంతాల వారికి కైలాస రథం (శాంతిరథం), ఫ్రీజర్ బాక్స్, ఉచిత అత్యవసర మోటర్ సైకిల్, ఆక్సిజన్ కాన్సంట్రేటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమాండూరి స్వామినాథన్, కమాండూరి సీతారామన్, ఎన్ఎన్.రాజు, మన్నే రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరందించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామాల్లో పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన తాగునీరందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. తాడేపల్లిగూడెంలో ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం బొలిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్‌పి సిఇఒ కెఎస్ సుబ్బారావుతో ఎంఎల్ఎ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా తాగునీటి అవసరాలను గుర్తించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నిధుల కోసం అవసరమైతే తాను స్వయంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను కోరతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇలు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే అద్భుత అవకాశాలు

తాడేపల్లిగూడెం:విద్యార్థులు ఇష్టపడి చదివితే అద్భుత అవకాశాలు ఉంటాయని వాసవీ కళాశాల పాలకవర్గం అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, సుబ్బారావు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను బిటెక్ విద్యార్థులకు మొదటి సంవత్సరం తరగతులను బుధవారం కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సును ఇష్టపడి చదువుతూ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు. కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు కోట్ల వెంకట రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, కోశాధికారి పేరూరి బాల కాశయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు, ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఇంజినీరింగ్ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థుల కోసం వారికి అవసరమైన విద్యా పరికరాలు పూర్తిస్థాయిలో అందజేస్తామని ఎమ్‌డి గయాసుద్దీన్ అన్నారు. స్థానిక జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు ఎమ్‌డి మసులుద్దీన్ భాషా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గయాసుద్దీన్ ఆర్థిక సహకారంతో కలింగగూడెం యుపి పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పాఠశాలకు మైకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రముఖ న్యాయవాది ఆకివీడు లయన్స్ క్లబ్ మాజీ కార్యదర్శి నెల్లి సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో గయాసుద్దీన్ పాల్గొని మాట్లాడారు. తన తండ్రి జ్ఞాపకార్థం ఏటా పాఠశాలలకు, విద్యార్థులకు అవసరమైన వాటిని అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారికి కావాల్సిన సహకారం అందించడం లక్ష్యంగా తమ మిత్రుడు, తాము లయన్స్ క్లబ్ ద్వారా పయనిస్తున్నామని తెలిపారు. ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన విద్యార్థులకు ఏటా 20 వేల రూపాయలు ప్రోత్సాహక బహుమతి ఇస్తున్నామని చెప్పారు. సమావేశంలో లయన్స్ ప్రముఖుడు, ఇంజినీర్ దాసరి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఇఒ సీతారామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశక సత్యనారాయణ, విశ్రాంత ఎంఇఒ కోటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు ఆర్‌వివి కృష్ణంరాజు, మాజీ సర్పంచి జి.రఘు ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని చేనేత అధికారి

కలెక్టర్ నాగరాణి ఆగ్రహం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రోటోకాల్ విషయంలో ఎటువంటి అలసత్వం వహించొద్దని ప్రజా ప్రతినిధులకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిందేనని, అది కూడా పార్టీలు కచ్చితంగా వ్యవహరించాలని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. అయితే జిల్లా కేంద్రంగా జరిగిన పదో చేనేత దినోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ప్రోటోకాల్‌ను విస్మరించారు. నియోజకవర్గ ప్రజాప్రతిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించకపోవడం విమర్శలకు తావిస్తోంది. చేనేత శాఖ అధికారి ఏక్ నిరంజన్‌లా కార్యక్రమం నిర్వహించాలని భావించి అన్నీ తానే అన్నట్టుగా ఉండడంతో సంబంధిత అధికారి జిల్లా కలెక్టర్ చేతులో చివరకు చీవాట్లు తిన్నట్లు తెలుస్తోంది. బుధవారం స్థానిక డిఎన్ఆర్ కళాశాల సిల్వర్ జూబ్లీ సమావేశ మందిరంలో జిల్లా చేనేత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 10వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరయ్యారు. ముందుగా చేనేత కోసం ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని చేనేత అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఎక్కడా కనిపించకవడంపై కలెక్టర్ సదరు శాఖ అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి నిలదీసినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా చేనేత జిల్లా శాఖ అధికారిపై ఇటు అధికార పార్టీ నాయకులు మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల్ని అధికారి పట్టించుకోలేదని పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రోటోకాల్ విషయంలో సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఈ నెల 1వ తేదీ నుంచి వారం రోజులపాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయని ఐసిడిఎస్ పీడీ బి.సుజాతారాణి తెలిపారు. వారోత్సవాల ముగింపులో భాగంగా విస్సాకోడేరులోని భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి గొరగనమూడి జాతీయ రహదారి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతోపాటు స్థానిక ప్రజానీకానికి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ఐసిడిఎస్ పీడీ సుజాతారాణి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రం స్థాయిలో, సెక్టార్, మండల ప్రాజెక్టు స్థాయిలో గర్భిణులు, బాలింతలకు, తల్లులందరికీ తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆకివీడు సిడిపిఒ వాణి విజయరత్నం, తల్లులు పాల్గొన్నారు.

ఉండి : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బి.సాయి చంద్ర అన్నారు. పెదపుల్లేరు గ్రామంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న డాక్టర్ సాయిచంద్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెదపుల్లేరు విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

యలమంచిలి : తల్లిపాలు పిల్లలకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని కాంబొట్లపాలెం సర్పంచి అనిశెట్టి మల్లిక అన్నారు. దొడ్డిపట్ల సెక్టార్‌లోని కాంబోట్లపాలెం అంగన్వాడీ సెంటర్ వద్ద తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మల్లిక మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రిపాలు పట్టించడం వల్ల భవిష్యత్తులో పిల్లలకు ఎటువంటి రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఎసిడిపిఒ పి.నాగరత్నం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మొగల్తూరు:మొగల్తూరు పంచాయతీ పరిధి గోదావరిపాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఆఖరి రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు అవగాహన కల్పిస్తూ ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్వాడీ సిబ్బంది జి.పెద్దింట్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.విరాజిత, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో తెలంగాణ ఎన్నికల కమిషనర్ పార్థసారథి

భీమవరం టౌన్:మావుళ్లమ్మను తెలంగాణ ఎలక్షన్ కమిషనర్ సి.పార్థసారథి బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ప్రసాదం, శేషవస్త్రం అమ్మవారి ఫొటో అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు చేసుకోవాలి

తాడేపల్లిగూడెం:రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అసలు సాగుదారుడు పేరుతోనే ఇ-పంటలో నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ యజమానులు వేరే ప్రదేశాల్లో ఉండి వ్యవసాయం చేయకుండా ఉంటే వారి పేరును ఈ పంటలో నమోదు చేయబోమని తెలిపారు. ఇ-పంట ఈ సార్వాకు మాత్రమే వర్తిస్తుందని, అది కూడా అసలు సాగుదారుడుకు పంటపై మాత్రమే హక్కు ఉంటుందని తెలిపారు. పంట సాగు చేస్తున్న ప్రతి రైతూ తప్పనిసరిగా ఇ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు.

రహదారుల పరిశీలన

మొగల్తూరు:మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించనున్న రహదారులను పంచాయతీరాజ్ ఎఇ ఎఎఆర్ వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ముత్యాలపల్లి కొత్తాట, కోమటితిప్ప తదితర గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి ఎన్ఆర్ఇజిఎస్ నుండి రూ.3. 50 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఆయా నిధులతో చేపట్టనున్న పనులను ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గట్టెం శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు కొల్లాటి గోపి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్ ఎస్ఐగా ప్రసాద్ బాధ్యతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం రూరల్ ఎస్ఐగా జెఎన్‌వి ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన సురేష్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటానన్నారు.